

ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా

శనివారం నవంబర్ 28,2026 పేజీలు 08

అలంపూర్‌లో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలోని శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీ జోగుళాంబ అమ్మవార్ల ఆలయాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుక్రవారం దర్శించుకున్నారు. ఎంపీ మల్లు రవి, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరిత, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ.సంపత్‌కుమార్‌తో కలిసి ఆలయాలకు చేరుకున్న మంత్రికి ఈఓ దీప్తిరెడ్డి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. బాలబ్రహ్మేశ్వర స్వామికి అభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం అందించగా ఈఓ శేషవస్త్రాలతో సత్కరించి ఆలయాల జ్ఞాపికలను బహూకరించారు. అంతకుముందు హరిజత టూరిజం వద్ద పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అలంపూర్ టూరిజం హోటల్ వద్ద మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి భైరన్‌పల్లి గ్రామానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు మధుమోహన్, కృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జూరాల ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి



పెబ్బేరు, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)
జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం సంబంధిత జూరాల ఎస్సీ ని కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, ఎడమ కాలువకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పేజి 2లో

బాల్య వివాహాల నిర్మూలనకు మహిళా సంఘాలు సమష్టిగా కృషి చేయాలి

..బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
.జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక

నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



2లో..

సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీడీకే అరుణ స్ట్రాంగ్ వార్నింగ్



నవంబర్ 27, విజన్ ఆంధ్ర మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి సీఎం రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని, ఆ భయంతోనే బీజేపీని తక్కువ చేసి చూపే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డి గతం మరచిపోయి మాట్లాడుతున్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో మీ సొంత పార్లమెంట్ స్థానమైన మహబూబ్‌నగర్‌లో 7 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా, ప్రజలు బీజేపీనే గెలిపించారు. మీ సిట్టింగ్ స్థానమైన మల్కాజ్‌గిరి ఎంపీగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో మిమ్మల్ని ఓడించింది ఆ సామాన్య కార్యకర్తలే అన్న విషయం మర్చిపోతే ఎలా?" అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని, అందులో భాగంగానే కాళేశ్వరం స్కాం, ఫోన్ ట్యాపింగ్ కేసులలో ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో మహిళలకు రూ. 2,500, 2లక్షల ఉద్యోగాలు, తులం బంగారం ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డి,పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మూడేళ్లలో పూర్తి చేయకుండా పాలమూరు భూములను పడావు పెట్టి రైతులకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏఐఎస్ఎఫ్-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్

నవంబర్ 27, విజన్ ఆంధ్ర మహబూబ్‌నగర్



డిసెంబర్ 7న ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపల్లి రాము పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక సుర వరం వెంకట్రాంరెడ్డి భవన్ లో దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో యువతకు ఉపాధి కల్పించాలని,ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టుల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7న విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ పోస్టర్ ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, యువతకు ఉపాధి ఉద్యోగాల నోటిఫికేషన్లు ఓటు హక్కు పరిరక్షణ , విద్యారంగ సమస్యలు, సర్ వ్యతిరేకం,ఓటు హక్కును పరిరక్షించాలని ఆయన కోరారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు రాజశేఖర్ లక్ష్మణ్ కుమార్ రెడ్డి మహేష్ బాబు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

..జిల్లా కలెక్టర్ ప్రియాంక



ఉట్కూర్, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)
ఉట్కూర్ మండల కేంద్రం లోని గ్రామ పంచాతి లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబం జీవితాన్ని భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలకు కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కుటుంబానికి అండగా నిలిచే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగినా, ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పావని, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

..ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

..పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



నారాయణపేటజిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని శుక్రవారం ఆయన పోలీస్ అధికారులకు సూచించారు.ప్రస్తుతం చలికాలం కావడంతో ఉదయం, రాత్రి వేళల్లో మంచు తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మంచు కారణంగా రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు, రోడ్డు మలుపులు, రహదారి అంచులు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల వాహనదారులు వేగాన్ని నియంత్రిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా, సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలలు, కళాశాలలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉల్లంఘించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ప్రయాణించేటప్పుడు వాహనాలకు సంబంధించిన లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని, వాహనాలపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు ఫాగ్ లైట్లు ఉపయోగించాలని, ముందున్న వాహనానికి తగిన దూరం పాటించాలని, అవసరమైతే సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపి పరిస్థితులు అనుకూలించిన తర్వాత ప్రయాణం కొనసాగించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయని, కొద్దిపాటి నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలితీసుకుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపినప్పుడే ప్రమాదాలను తగ్గించగలమని పేర్కొన్నారు.

ప్రజల ప్రాణాల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు.

జూరాల ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ జూరాల ఎడమ కాలువ కింద సాగు చేస్తున్న రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టి పంటలు సాగు చేశారని, సరైన సమయంలో నీరు అందకపోతే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఒకవైపు పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు, మరోవైపు సాగునీటి కొరత రైతులను ఆర్థికంగా, మానసికంగా కుంగదీస్తున్నాయని అన్నారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే, వారికి అవసరమైన సమయంలో సాగునీరు అందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేశారు. ప్రభుత్వం, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి నీటిని విడుదల చేయాలని కోరారు.

లేనిపక్షంలో రైతుల పక్షన స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించి, నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. రైతుల పంటలు కాపాడే వరకు, వారికి సాగునీరు అందించే వరకు రైతుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రైతుల కన్నీళ్లు తుడవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రైతులకు న్యాయం జరిగేలా వెంటనే సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

ఇట్టి కార్యక్రమం లో పెబ్బేరు పట్టణ అధ్యక్షులు కావాలి క్రాంతి కుమార్ , మండల అధ్యక్షుడు నాగరాజ్ యాదవ్ శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ నాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి రాఘవేంద్ర గౌడ్ జిల్లా కౌన్సిల్ మెంబర్స్ రంగస్వామి గౌడ్, నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల రామకృష్ణ గారు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నరసింహ నాయుడు, జిల్లా సీనియర్ నాయకులు సర్వేశ్వర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర్ గౌడ్,మోడలా వినోద్ సాగర్, నారాయణ, శాఖాపురం రఘు, శివ, చింతకాయల శివ, పెంచకలపాడు బలరాం, వడ్డే తిరుపతయ్య గారు, రంగాపురం తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు మహిళా సంఘాలు సమష్టిగా కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

బాల్య వివాహాల నిర్మూలనకు మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డెన్ లో శుక్రవారం జరిగిన బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ బాల్య వివాహాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి తల్లి దండ్రి తమబాల్య వివాహాల వల్ల ఆడపిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని, వారి విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని తెలిపారు.ప్రస్తుత సమాజంలో మహిళా సంఘాలు అత్యంత శక్తివంతమైన వ్యవస్థలని, మహిళా సంఘాల సభ్యుల్లో ఉన్న ఐక్యత, నిబద్ధత, సామాజిక బాధ్యత మరే ఇతర వ్యవస్థల్లోనూ అంత సులభంగా కనిపించవని అన్నారు. మహిళా సంఘాలపై ప్రభుత్వం, బ్యాంకులు నమ్మకంతో ఎలాంటి పూచీకత్తు లేకుండానే రుణాలు అందిస్తున్నాయని గుర్తు చేశారు.

ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో కూడా బాల్య వివాహాలు కొనసాగడం సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు.గతంలో మన పెద్దలకు చిన్న వయసులోనే వివాహాలు జరిగాయని అదే సంప్రదాయాన్ని కొనసాగించకూడదని సూచించారు. కాలం మారుతున్న కొద్దీ పరిస్థితులు, జీవన విధానాలు మారుతున్నాయని, నేటి ఆడపిల్లలకు విద్య, ఉద్యోగాలు, వ్యాపారాలు, సాంకేతిక రంగాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం వంటి చట్టాలు సమాజంలోని పిల్లల రక్షణ, భద్రత కోసం రూపొందించబడ్డాయని, వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని, బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు.జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన ఒక్క అధికారితోనో, ఒక్క శాఖతోనో సాధ్యం కాదని, ప్రతి గ్రామం, పట్టణం, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ ' 1098 ' కు ఫోన్ చేసి తెలియజేయాలని, సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు, పోలీసు, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖల బృందాలు స్పందించి బాల్య వివాహాన్ని అడ్డుకుంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శంకర్, డీఎంహెచ్ ఓ జై చంద్ర మోహన్, డీసీపీయూ సభ్యులు తిరుపతయ్య, కరిష్మా, మిషన్ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఫీల్డ్ లెవల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, డాక్టర్ భాగ్యవతి మల్లేష్ 11 వార్డ్ కౌన్సిలర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

మద్దూరుపోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కోస్గి సీఐ సైదులు తెలిపారు.

ఈ క్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూరు ఎస్ఐ విజయ్ కుమార్, నిద్చింత గ్రామ సర్పంచ్ భర్త శ్రీనివాసులు కలిసి శుక్రవారం మద్దూరు నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిపై నిద్చింత గ్రామ రోడ్డు మలుపు వద్ద ప్రమాదకర ప్రాంతాన్ని (బ్లాక్ స్పాట్) గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం



ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా త్వరలోనే ప్రమాద సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ పోలీస్ శాఖతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు రహదారులపై ప్రయాణించే సమయంలో వేగ నియంత్రణ పాటించాలని, ముఖ్యంగా రోడ్డు మలుపులు, ప్రమాదకర ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని సీఐ తెలిపారు.

ఎట్టకేలకు సరస్వతి నగర్‌లో తీరిన తాగునీటి సమస్య...

మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా.. స్థానికుల హర్షం...

నారాయణపేట, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

జిల్లా కేంద్రంలోని 3వ వార్డు సరస్వతి నగర్ కాలనీలో కొంతకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. నీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులకు శుక్రవారం ఊరట కలిగింది. మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య ఆధ్వర్యంలో మిషన్ భగీరథ సిబ్బంది కాలనీలో పైప్‌లైన్ పనులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు. పైప్‌లైన్ ద్వారా నీరు రావడంతో ఇన్నాళ్లుగా ఎదురుచూస్తున్న



కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్యతో పాటు మిషన్ భగీరథ సిబ్బందికి స్థానికులు అభినందనలు తెలిపారు. తమ వార్డుకు ఎంతోమంది కౌన్సిలర్లు ఎన్నికైన కూడా మంచినీటి సౌకర్యాన్ని కల్పించడంలో నిర్లక్ష్యమే వహించారు. కానీ కాకర్ల నారాయణమ్మ కౌన్సిలర్ గా ఎన్నికైన తర్వాత కాలనీలో వృద్ధులకు పెన్షన్ ఇప్పించడంలో కానీ అంతేకాకుండా కాలనీలో రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వేయించడంలో కూడా వారు చేసిన సేవలను ఎన్నో ఉన్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. అదేవిధంగా ఈరోజు కాలనీకి మంచినీటి సమస్యలు పరిష్కరించిన ఘనత వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ కి దక్కిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా డాక్టరేట్ కాకర్ల భీమయ్య, అధ్యక్షులు మున్సిపాలిటీ మరియు మిషన్ భగీరథ అధికారులు సిబ్బంది కాలనీవాసులు, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాపనపల్లి శ్రీనివాస్, సీపీఎం నాయకులు వెంకట్రామ్ రెడ్డి, మెడికల్ నారాయణ, రుద్రారెడ్డి, శివారెడ్డితో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి నీటి సరఫరా కల్పించిన లయన్ రవికుమార్ గౌడ్

నారాయణపేట, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి లయన్ రవికుమార్ గౌడ్ భక్తులకు నీటి సరఫరా కల్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దేవాలయానికి అవసరమైన వాటర్ మోటార్, పైపులు, విద్యుత్ వైర్లు, స్టార్టర్ తదితర సామగ్రిని విరాళంగా అందించారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే గొప్ప మనసు, ఎవరైనా సహా యం కోరితే వెంటనే స్పందించే మానవత్వం రవికుమార్ ప్రత్యేకత.

మధ్యతరగతి కుటుంబాల నుంచి పేద ప్రజల వరకు, యువత నుంచి వివిధ వర్గాల ప్రజల



వరకు ఎవ రికైనా అవసరమైన సమ యంలో తన వంతు సహా యం అందిస్తూ, ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకు రవికుమార్ గౌడ్ గారు నిజంగా సేవా భావానికి ప్రతీకగా నిలిచారు. ఆపదలో ఉన్నా మని ఒక్కసారి ఆయనకు తెలియజేస్తే చాలు, తనకు సాధ్యమైనంత సహాయం అందిస్తూ ఆపద్బాంధ వుడిగా నిలుస్తున్నారు. ఎన్నో ప్రాంతాల్లో, ఎంతో మంది యువకులకు, పేదలకు, సామాన్య ప్రజలకు వివిధ రూపాల్లో సహాయం చేస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వ హించడం ఆయన గొప్పతనం. ఇలాంటి సేవా గుణం కలిగిన నాయకులు సమాజానికి ఎంతో అవ సరం. ప్రజలకు అండగా నిలుస్తూ, సేవా మార్గంలో ముందుకు సాగుతున్న లయన్ రవికుమార్ గౌడ్ కు ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందన లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ మోహన్ కుమార్ కోన, లయన్ ఎస్. చక్రవర్తి, కాకర్ల భీమయ్య గురుస్వామి, అప్పి గురు స్వామి, కృష్ణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అయిజ అభివృద్ధికి మంత్రి సీతక్కకు వినతి..

10 అభివృద్ధి అంశాలను వివరించిన మున్సిపల్ చైర్మన్.

అయిజ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ, మండల అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర మంత్రి సీతక్కకు అయిజ మున్సిపల్ చైర్మన్ వినతిపత్రం అందజేశారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జనాభా పరంగా అతిపెద్ద మండలాల్లో అయిజ ఒకటని, అయినప్పటికీ మున్సిపాలిటీ, మండలం అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర దక్షిణ చివరన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల మధ్య ఉన్న అయిజకు రాజధాని హైదరాబాద్ దూరంగా ఉండటంతో ప్రాంతీయ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తక్కువగా వస్తున్నాయని వివరించారు.

మంత్రి సీతక్క అయిజ ప్రాంతానికి రావడం ప్రజలకు ఎంతో సంతోషకరమని పేర్కొంటూ, ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా అయిజను తాలూకాగా ఏర్పాటు చేయాలని, పట్టణంలో ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని, గురుకుల పాఠశాల మరియు మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు.

అయిజ మండలంలో నెట్టెంపాడు ప్రాజెక్టు కాలువ పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు, బోరు మోటార్లు, విద్యుత్ కనెక్షన్ల కోసం రూ. 1 కోటి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అయిజ మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణానికి రూ. 5 కోట్లు కేటాయించాలని, ఖాళీగా ఉన్న



5 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 12 హెల్పర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అదనంగా 5 అంగన్‌వాడీ కేంద్రాలను మంజూరు చేయాలని కోరారు.

పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ భవనాన్ని పోలీస్ ఔట్‌పోస్ట్‌గా వినియోగించి, పోలీసు సిబ్బందిని నియమించాలని, క్రీడాకారుల కోసం క్రీడా మైదానానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అయిజ మున్సిపాలిటీ, మండలంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థినులు ఉన్నత విద్యకు ఇబ్బందులు పడుతున్నారని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మహిళా డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని మంత్రి సీతక్కను కోరారు.

అయిజ మున్సిపాలిటీ, మండల ప్రజల అభివృద్ధి కోసం మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి, ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే డీకే. సత్య రెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన

మాజీ ఎమ్మెల్యే డీకే భరత సింహారెడ్డి

గద్వాల నవంబర్ 27 (విజన్ ఆంధ్ర బ్యూరో)



గద్వాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డికె. భరత సింహారెడ్డి తండ్రి మాజీ శాసన సభ్యులు డికె.సత్యరెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎస్ వి . ఈవెంట్ హాల్ వారీ సమాధి వద్ద, పాతబస్టాండ్ లోని ఆయన విగ్రహానికి పులా మాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్కోటే, జిల్లా బిజెపి అధ్యక్షుడు బాబుల్ రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు అనంతపురం విష్ణువర్ధన్ రెడ్డి,మన్నపురం సంజీవయ్య,మీర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, రజక నరసింహ,జనార్దన్ రెడ్డి,మెడికల్ తిరుమల్ రెడ్డి,సందీప్ గౌడ్,కృష్ణంరాజు,రఘు గౌడ్,మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లుశాలన్న, చంద్రశేఖర్,తదితరులు హాజరై మాజీ ఎమ్మెల్యే డీకే సత్య రెడ్డికి నివాళులర్పించారు.

రాష్ట్ర మంత్రులకు స్వాగతం పలికిన

సింగిల్ విండో చైర్మన్ సుజాత రాముడు

అయిజ నవంబర్ 27 విజన్ ఆంధ్ర)



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి,ఎంపీ డాక్టర్ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ కి అయిజ పట్టణంలో సింగిల్ విండో చైర్మన్ సుజాత రాముడు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రుల పర్యటన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, వారికి స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

మహిళ బాలుడు అదృశ్యం భర్త ఫిర్యాదు

నాగర్ కర్నూల్ జిల్లా, (ఫోటో జర్నలిస్ట్) నవంబర్ 27, తెలకపల్లి,



మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన గుజ్జరి శివ తన భార్య ఏడేళ్ల కుమారుడు కనిపించడం లేదని పోలీసులను ఆశ్రయించాడు ఫిర్యాదు దారుడి వివరాల ప్రకారం ఈనెల 18న పని నిమిత్తం నాగర్ కర్నూల్ కు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తన భార్య కుమారుడు ఇంట్లో కనిపించకపోవడంతో బంధువులు అదేవిధంగా తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు అదృశ్యమైన మహిళ పేరు, వర్షిత, వయస్సు(25) కుమారుడి పేరు విశ్వతేజ్ వయస్సు (7) భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఆర్థిక స్వాతంత్రం సాధించిన తర్వాతే పెళ్లి చేసుకోవాలి

...బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

..బాల్య వివాహ రహిత నారాయణపేట జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా ముందుకు రావాలి

..బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి, ఆర్థిక స్వావలంబన సాధించిన తర్వాతే వివాహం చేసుకోవాలి

..బాల్య వివాహాల నివారణలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మతపెద్దలు కీలక పాత్ర పోషించాలి

..జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఉట్కూర్ మండల కేంద్రం గ్రామ పంచాయతీ ఆవరణం లో నిర్వహించిన గ్రామ సభ లో పిలుపునిచ్చారు.బాల్య వివాహ ముక్త్ భారత్ క్యాంపెయిన్‌లో భాగంగా అంతర్జాతీయ బాల్య వివాహాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఊట్కూర్ మండలంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

నారాయణపేట జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతుండటం బాధాకరమని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోనే బాల్య వివాహాల సమస్య ఎక్కువగా ఉన్న జిల్లాల్లో నారాయణపేట ఒకటిగా ఉందని తెలిపారు. ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, చట్టాలపై అవగాహన పెరుగుతున్నప్పటికీ బాల్య వివాహాల సమస్య నుంచి పూర్తిగా బయటపడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే 60కి పైగా గ్రామ పంచాయతీలు బాల్య వివాహ రహిత గ్రామాలుగా మారేందుకు సంకల్పం తీసుకొని, బాల్య వివాహ రహిత గ్రామాలుగా డిక్లరేషన్ ఇచ్చాయని తెలిపారు. మిగిలిన గ్రామాలు కూడా ఇదే దిశగా ముందుకు రావాలని సూచించారు.బాల్య వివాహాల నిర్మూలన అనేది కేవలం ఒక శాఖకు సంబంధించిన బాధ్యత కాదని, ఇది సామాజిక సమస్య అని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే దీనిని పూర్తిగా నిర్మూలించగలమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.గ్రామాల్లోని



పురోహితులు, పండితులు, ఖాజీలు, పాస్టర్లు కూడా బాల్య వివాహాలు చేయబోమని స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల కోసం తమ వద్దకు ఎవరైనా వస్తే వాటిని ప్రోత్సహించకుండా అడ్డుకోవాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లి వివాహాలు జరిపించకుండా కూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని, అధికారులు తక్షణమే స్పందించి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి ..

ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన బాలికలు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, అందుకు విద్యే ప్రధాన మార్గమని తెలిపారు. తాను కూడా రహదారి సౌకర్యం సరిగా లేని గ్రామం నుంచి వచ్చి జిల్లా కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని, అదే విధంగా గ్రామాల్లోని బాలికలు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. విద్యార్థినులు ప్రతిరోజూ కష్టపడి చదవాలని, పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలని, ప్రతి అంశాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలని సూచించారు. రాబోయే 30 సంవత్సరాల్లో తమ జీవితం ఎలా ఉండాలనే లక్ష్యాన్ని ఇప్పుడే నిర్దేశించుకొని, దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. గతంలో తమ అమ్మమ్మలు, నానమ్మలకు చిన్న వయస్సులోనే వివాహాలు జరిగాయని, ఇప్పుడు కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే ఆలోచన విడనాడాలని అన్నారు. కాలానికి అనుగుణంగా సమాజం మారాలని, బాలికలు విద్యావంతులై జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఆర్థిక స్వావలంబన సాధించిన తర్వాతే వివాహం చేసుకోవాలి.బాలికలు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని, ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం లేదా వ్యాపారం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించిన తర్వాత వివాహం గురించి ఆలోచించాలని సూచించారు. ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నప్పుడు జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.

బాల్య వివాహ రహిత నారాయణపేట జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడాది ప్రతి ఒక్కరూ సంకల్పంతో పనిచేయాలని, భవిష్యత్ తరాలకు బాల్య వివాహాల సమస్య లేకుండా చేయడంలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డీసీపీఓ కరిష్మా ,మండల ప్రత్యేక అధికారి శంకర్, ఎంపీడీవోల పావని, వైద్య బృందం, గ్రామ సర్పంచ్ రేణుక భరత్ వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థినులు,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కార్యకర్తలను పరామర్శించిన

బిఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు

గద్వాల నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు గద్వాల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బాస్ హనుమంతు నాయుడు శుక్రవారం మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామానికి చెందిన రవి, కేటిదొడ్డి మండల కేంద్రానికి చెందిన నర్సింహులు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని, హాస్పిటల్ కు వెళ్లి, వారిని పరామర్శించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకొని,మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

6 వ వార్డులో స్వంత ఖర్చుతో 4 మినీ వాటర్ ట్యాంక్ లు ప్రారంభం

మక్తల్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



మక్తల్ మున్సిపాలిటీ చందాపూర్ లో నాలుగు మంచి నీటి ట్యాంకులను కట్టించిన 6 వార్డు కౌన్సిలర్ సత్యమ్మ మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6 వ వార్డు చందాపూర్ గ్రామంలో స్వర్గీయ మహాదేవప్ప జ్ఞాపకార్థంగా నాలుగు మంచి నీటి మినీ వాటర్ ట్యాంక్ లను స్వంత ఖర్చులతో కౌన్సిలర్ సత్యమ్మ కట్టించారు.ఇట్టి మినీ వాటర్ ట్యాంక్లను బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, కౌన్సిలర్ సత్యమ్మ ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు రహీమ్ పటేల్ , టప్ప కృష్ణ కమిషనర్ రాజయ్య ,ఏ ఈ నాగ శివ గ,ఏ ఓ సుదర్శన్ గౌడ్ ,మాజీ కౌన్సిలర్ మొగిలప్ప, గ్రామస్తులు చందాపూర్ రాము, లక్ష్మణ్, కొండయ్య, సిరిపే రాజు, నాగరాజు, నరసింహులు, మేస్త్రి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మంత్రుల పర్యటన సందర్భంగా...

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి ని హౌస్ అరెస్ట్..

అయిజ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి ని పోలీసులు ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు అనంతరం వారు మాట్లాడుతూ గత దశాబ్దాల కాలంగా పేరుకుపోయిన ఎన్నో సమస్యల పై గళం విప్పుతే అరెస్ట్ చేయడం దారుణం అని, అరెస్ట్ తో ఉద్యమం ఆపలేరని అన్నారు. పేరుకుపోయిన సమస్యల గురించి వివరిస్తూ పట్టణం లో 30 పడుకల హాస్పటల్ 4 1/2 సంవత్సరాల నుండి నిర్మాణం ఆగినదని,డిగ్రీ కళాశాల కోసం గత దశాబ్దకాలం నుండి పోరాటం చేస్తున్నామని , ఫైర్ స్టేషన్ కోసం 15 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు.పులికల్ రోడ్ గత 9 సంవత్సరాలుగా పెండింగ్ లోనే ఉందని, అదేవిధంగా కర్నూల్ రోడ్



(పెద్దవాగు బ్రిడ్జి) ఎప్పుడు కూలుతుందో తెలియని అన్నారు. అదేవిధంగా అయిజ కు శాంక్షన్ ఐన ఎస్ సి.గురుకుల పాఠశాల ఎర్రవల్లి లో 6 సంవత్సరాల నుండి ఉందని, అయిజకు శాంక్షన్ ఐన కోర్ట్ గద్వాల లో ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి వాటిపై పోరాటం చేస్తే అరెస్ట్ చేయడం దారుణమని పేర్కొన్నారు.

దిశ ఘటనకు నేటికి ఏడేళ్లు, న్యాయం ఎక్కడ?

సిర్పూర్కర్ కమిషన్ నివేదిక అమలుపై ప్రభుత్వం,న్యాయవ్యవస్థ సమాధానం చెప్పాలి!
మనుషులను చంపే అధికారం ప్రభుత్వానికి దాని యంత్రాంగానికి లేదు.
బాధిత కుటుంబాలను ఆదుకోండి.
మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి

మక్తల్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

2019 లో హైదరాబాద్ శివార్లలోని చటాన్‌పల్లి వద్ద దిశ అత్యాచారం, హత్య కేసులో నిందితులుగా అరెస్టయిన నలుగురు వ్యక్తులు పోలీసుల కాల్పుల్లో మరణించిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది.ఈ ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.ఎస్. సిర్పూర్కర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల విచారణ కమిషన్ సమగ్రంగా విచారణ జరిపి 2022లో తన నివేదికను సమర్పించింది.

కమిషన్ తన నివేదికలో పోలీసుల కాల్పులను ఆత్మరక్షణ చర్యగా అంగీకరించలేమని పేర్కొంటూ, సంబంధిత పోలీసు అధికారులపై హత్యకు సంబంధించిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. అంతేకాకుండా, ఎన్‌కౌంటర్‌లో మరణించిన నలుగురిలో ముగ్గురు ఘటన జరిగిన సమయంలో మైనర్లుగా ఉన్నట్లు కమిషన్ గుర్తించడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో కొన్ని ప్రశ్నలకు ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ సమాధానం చెప్పాలి. సుప్రీంకోర్టు



నియమించిన కమిషన్ నివేదికలో తీవ్రమైన నిర్ధారణలు ఉన్నప్పటికీ, సంబంధిత పోలీసు అధికారులపై సెక్షన్ 302 నమోదు చేయాలని సిఫారసు చేసిన విషయం అందరికీ తెలిసిందే. అలాగే ముగ్గురు మైనర్ల వయస్సుకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి వచ్చిన తర్వాత జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం వారి హక్కుల ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనేది ఈనాటి సమాధానం లేదు. పోలీసుల కాల్పుల్లో మరణించిన నలుగురి కుటుంబాలకు న్యాయం, న్యాయ సహాయం, పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తూ బాధిత కుటుంబాలను రోడ్డున పడేసింది.

మహిళలపై అత్యాచారాలు, హత్యలకు కఠినమైన చట్టపరమైన శిక్షలు విధించాలి. అదే సమయంలో నిందితులుగా ఉన్న వ్యక్తులకు కూడా రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు, న్యాయమైన విచారణ హక్కు ఉంటాయి. నేరం చేసిన వారిని చట్టం ప్రకారం శిక్షించడం న్యాయవ్యవస్థ బాధ్యత. నిందితులను విచారణ లేకుండా చంపడం న్యాయం కాదు.రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తించాలి. పోలీసులు చట్టానికి అతీతులు కాదు. కావున కమిషన్ చాలా స్పష్టంగా పోలీసులు ఉద్దేశపూర్వకంగానే కాల్పులు జరిపారని చెప్పినప్పటికీ పోలీసులపై న్యాయ విచారణ తూతూ మంత్రంగానే కొనసాగింది.

దిశకు న్యాయం జరగాలని,అదే సమయంలో ఎన్‌కౌంటర్‌లో మరణించిన నలుగురి విషయంలోనూ చట్టబద్ధమైన న్యాయం మరియు ఘటన జరిగి ఏడేళ్లు గడుస్తున్నాకూడ బాధిత కుటుంబాలకు పరిహారం అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనిపిస్తున్నది. కావున ప్రభుత్వం ఈనాటికైనా బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మానవ హక్కుల సంఘం కార్యకర్త మద్దిలేటి డిమాండ్ చేశారు.

అన్ని దానాల కన్న అన్నదానం గొప్పది

కీ. శే. ఎదిరే అశోక్ కుమార్ గుప్త వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం

మక్తల్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



మక్తల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు ఎదిరే అశోక్ కుమార్ గుప్తా వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం మక్తల్ స్థానిక శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర మధ్యాహ్నం 1. 30 గంటలకు ఎదిరే అశోక్ తల్లి కమలమ్మ, భార్య ఎదిరే సుధ, కుమారులు ఎదిరే శ్రీ చరణ్, సాయి రిపుత్ వారి కుటుంబ సభ్యుల సహకారం తో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఎదిరే అశోక్ గుప్త వాసవి దేవాలయం నిర్మాణం లో అలాగే వాసవి దేవాలయం వర్తక వ్యాపారం సముదాయం, ట్రాన్స్ఫార్మర్, జనరేటర్ వివిధ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర పోషించిన వ్యక్తి వర్ధంతి రోజున అన్నదానం చేయడం వలన ఆయన ఆత్మ కు శాంతి చేకూరుతుందని, అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని, సేవ చేసే భాగ్యం ప్రతి ఒక్కరికి రాదని, వాసవి క్లబ్ మాత్రం అన్ని వర్గాల వారికి సేవ చేస్తుందని ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు తెలిపారు.

కార్యక్రమం లో వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, మక్తల్ వనిత క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మనసాని దేవి పద్మావతి,మాజీ అధ్యక్షురాలు ఎదిరే సుధారాణి, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.

...ధన్వాడలో 'ఓటు బచావో -- దేశ్ బచావో' పై బి ఎల్ ఓ లకు అవగాహన
.. పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి

నారాయణపేట, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ధన్వాడ మండల కేంద్రంలో 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా 'ఓటు రక్షక్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐసీసీ పరిశీలకులు రవీంద్ర దాస్, టీపీసీసీ కోఆర్డినేటర్ రాచమల్ల సిద్ధేశ్వర్ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా రవీంద్ర దాస్ మాట్లాడుతూ, బూత్ స్థాయి నాయకులే పార్టీకి అసలైన బలమని, ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాహుల్ గాంధీ ప్రారంభించిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమం లక్ష్యం ఓటు హక్కును, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమేనని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యాప్, పార్టీ అందుబాటులోకి తీసుకొస్తోందని



తెలిపారు. ప్రత్యేక యాప్, వెబ్‌సైట్ ద్వారా ప్రతి బూత్‌లో ఓటర్ల వివరాలు, తొలగించబడిన పేర్లు, కొత్తగా చేరిన ఓటర్ల వివరాలను పర్యవేక్షించవచ్చని వివరించారు. ఈ ప్రక్రియ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బూత్ స్థాయి నాయకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

రాచమల్ల సిద్ధేశ్వర్ మాట్లాడుతూ, మరణించినవారు, వలస వెళ్లినవారు, పొరపాటున తొలగించబడిన ఓటర్ల వివరాలను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు.డీసీసీ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నారాయణపేట నియోజకవర్గంలో ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు 5,600 డూప్లికేట్ ఓట్లు, 7,464 మరణించిన ఓటర్ల వివరాలు, 21,508 శాశ్వత వలస ఓటర్లు, 1,959 మంది ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి సమర్పించని వారు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 36,603 మంది ఆబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్ విభాగంలోని ఓటర్ల వివరాలను బూత్ స్థాయిలో పరిశీలించాలని సూచించారు.ప్రతి బూత్ నాయకుడు బాధ్యతగా వ్యవహరించి ఓటరు జాబితాలను పరిశీలించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్ పక్రియ పార్టీ పరిశీలకులు రఘుపతి రెడ్డి,మల్లేష్, జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వినర్ గాజుల శివకుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం, అధికార ప్రతినిధి సంతోష్, గొల్ల కృష్ణయ్య, మాజీ మండల అధ్యక్షులు నరహరి ముదిరాజ్, ఎండి.గౌస్,చిట్టెం రాఘవేంద్ర రెడ్డి, ఆనంద్ వివిధ గ్రామాల సర్పంచ్ లు, బీల్వోలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. హృదయ రాజు

అలంపూర్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



అలంపూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. హృదయ రాజు సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులకు క్రమశిక్షణ, గురుభక్తి ప్రాముఖ్యతను వివరిస్తూ, రాబోయే 3 నెలలు కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.బి

ప్రిన్సిపాల్ బండ్ల దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన స్టాఫ్ మీటింగ్‌లో సిలబస్ పూర్తి, స్టడీ అవర్స్ నిర్వహణపై అధ్యాపకులకు దిశానిర్దేశం చేస్తూ, కళాశాల అభివృద్ధి పనులను ప్రశంసించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఇంగ్లీష్ బోధిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి సేవలకు విద్యాశాఖ ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని ప్రత్యేకంగా అభినందించారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

జిల్లా నాగర్ కర్నూల్, నవంబర్ 27 - విజన్ ఆంధ్ర న్యూస్ :

పట్టభద్రుల ఓటరు జాబితా పునఃతయారీకి నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ వెల్లడించారు.

మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 01.11.2026ను అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకుని ఓటరు జాబితా పునఃతయారు చేస్తున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 28, 29 తేదీల్లో మొదటి విడత, డిసెంబర్ 5, 6 తేదీల్లో రెండో విడత శిబిరాలు జిల్లాలోని ప్రతి గుర్తించిన పోలింగ్ కేంద్రంలో



నిర్వహించనున్నారు.ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేర్లు, వివరాలు పరిశీలించుకోవాలని, జాబితాలో పేరు లేకుంటే ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తప్పులు, మార్పులు ఉంటే ఫారం-7, ఫారం-8 ద్వారా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించాలని తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు డిసెంబర్ 10 చివరి గడువుగా నిర్ణయించారు.ప్రత్యేక శిబిరాలతో పాటు సాధారణ విధానంలోనూ దరఖాస్తులకు అవకాశం ఉందని, శిబిరాల్లో ఏఈఆర్ఓలు, నియమిత అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

కానాయిపల్లి ఆర్ అండ్ ఆర్ కేంద్రంలో పనులను పరిశీలించిన -- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) :



కొత్తకోట: వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం కొత్తకోట మండల పరిధిలోని కానాయిపల్లి ఆర్ అండ్ ఆర్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ కొనసాగుతున్న లెవలింగ్, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబర్ మొదటి వారంలో డ్రా ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అప్పటిలోగా లెవలింగ్ పనులతో పాటు మిగిలిన మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి పొందిన 1,034 మంది లబ్ధిదారులకు డిసెంబర్ మొదటి వారంలో డ్రా ద్వారా ప్లాట్లను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిగతా వారికి కూడా ప్లాట్లు కేటాయించేందుకు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని వాటికి కూడా అనుమతులు రాగానే కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం కలెక్టర్ కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని దండుగడ్డ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. నూతన ఆరోగ్య ఉపకేంద్రాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చి, ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపకేంద్రంలో వైద్య సేవలను వెంటనే ప్రారంభించాలని సంబంధిత వైద్య అధికారిని ఆదేశించారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, స్థానికులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు కరువు

ఆర్థిక ఇబ్బందులతో స్వీపర్లు, కామాటీల అవస్థలు.. వెంటనే వేతనాలు చెల్లించాలని బీఎస్పీ డిమాండ్

కొత్తకోట, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) :

కొత్తకోట: మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సుమారు 60 మంది పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా స్వీపర్లు, కామాటీలు నెలల తరబడి జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం విచారకరమని బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ జనంపల్లి



వినోద్ కుమార్ అన్నారు.

కార్మికులు తమ కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు అప్పులపాలయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని జనంపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను గుర్తించి వారికి సకాలంలో వేతనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

శ్రీశ్రీశ్రీ దశశ్రేష్ఠ శ్రీ భక్త కనక దాసు 539వ జయంతి వేడుకల్లో పాల్గొన్న

ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

గద్వాల నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని చింతల కుంట గ్రామంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శ్రీ శ్రీ శ్రీ దశశ్రేష్ఠ శ్రీ భక్త కనకదాసు 539 జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి ప్రత్యేక పూజ నిర్వహించారు.కురువ కులస్తుల కురువ డోలతో ఎమ్మెల్యే ఘనంగా స్వాగతం పలికారు.

అలాగే కుచినెర్ల గ్రామంలో శ్రీ శ్రీశ్రీ కనకదాసు 539 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే కి గ్రామస్తులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముందుగా కురువ కులస్తులందరికీ దశశ్రేష్ఠ శ్రీ భక్త కనక దాసు 539 వ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

కర్ణాటక ప్రాంతంలో ఉడిపి ప్రసిద్ధి పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణుని దేవాలయంలో శ్రీకృష్ణుని దర్శించుకోవడానికి అవకాశం కల్పించేవారు కాదు దేవాలయం వెనుక నుండి



శ్రీకృష్ణుని భక్తిగా ప్రార్థించడం జరిగింది కనకదాసు ఆయన భక్తికి మెచ్చి శ్రీకృష్ణుడు వెనుక తిరిగి కనకదాసు కు దర్శనం ఇవ్వడం జరిగినదని అన్నారు.

శ్రీ కనక దాసు జయంతి సందర్భంగా గ్రామ గ్రామాలలో పండగ వాతావరణం సంతరించుకుంది.

శ్రీ భక్త కాకదాసు జయంతిని వచ్చే సంవత్సర నాటికి ప్రభుత్వం పరంగా అధికారికంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి శ్రీ కనకదాసు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో గద్వాల నియోజకవర్గం లో బడుగు బలహీన వర్గాలలో అభ్యున్నతకు, అభివృద్ధికి కోసం హర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. కనకదాసు ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలో గద్వాల నియోజకవర్గం లోని ప్రజలందరి ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో సిరిసంపదలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా కనకదాసుని కోరుకోవడం జరిగింది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కురువ హనుమంతు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మాజీ ఎంపిపి విజయ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు ,సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, సర్పంచ్ కృష్ణ, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఆలయం సతీష్, నాయకులు ఉరుకుందు, మైలగడ్డ చంద్రశేఖర్ విశ్వనాథ్ రెడ్డి, హరి ప్రసాద్ గౌడ్, తిక్కన్న, కృష్ణ రెడ్డి , ఖాజా , గోవింద్ రెడ్డి, నారాయణ రెడ్డి నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘన.. పెట్రోల్ బంకు 15 రోజుల పాటు బంద్

చిన్నంబావి, నవంబర్ 27:(విజన్ ఆంధ్ర)

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెలగొండ గ్రామంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో ఆయిల్ కంపెనీ మార్కెటింగ్ విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు లోపాలను గుర్తించారు. మార్కెటింగ్ క్రమశిక్షణ నిబంధనల (ఎండీజీ) ప్రకారం చేపట్టిన ఈ తనిఖీల్లో మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం, సిబ్బందికి యూనిఫాం లేకపోవడం, లేఅవుట్ అనుమతి పత్రాలు ప్రదర్శించకపోవడంతో పాటు డీజిల్ నిల్వల్లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. నిల్వల్లో సుమారు 400 లీటర్లకు పైగా డీజిల్ అదనంగా ఉన్నట్లు స్థానికంగా చర్చ జరుగుతుండగా.. 275 లీటర్ల తగ్గుదల (మైనస్) వచ్చిందని బంకు నిర్వాహకులు చెబుతున్నారు. తనిఖీ నివేదిక ఆధారంగా ఎండీజీ నిబంధనల మేరకు చర్యలు తీసుకున్న అధికారులు, సదరు బంకులో 15 రోజుల పాటు విక్రయాలు నిలిపివేస్తూ మూసివేశారు.



గుడులకు నిధులు.. రోడ్లకు కోట్లు.. మరి పేద పిల్లల చదువులకు నిధులేవి?

నాగర్ కర్నూల్ జిల్లా(విజన్ ఆంధ్ర)27/నవంబర్ /2026

అచ్చంపేట సభలో విద్యారంగాన్ని విస్మరించిన సీఎం రేవంత్ రెడ్డి -- AISF ఆగ్రహం!

ప్రభుత్వం అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, గుళ్లు, భవనాల నిర్మాణమేనా? పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వానికి పట్టదా? -- ూ×ూఖీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలముల ప్రేమ్ కుమార్

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నవంబర్ 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రకటనలు చేయడం జరిగిందని, అయితే ఈ ప్రాంతంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి కనీసం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం బాధాకరమని ూ×ూఖీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలముల ప్రేమ్ కుమార్ విమర్శించారు, సీఎం సభలో రోడ్ల అభివృద్ధికి రూ.274 కోట్లకు పైగా నిధులు, అచ్చంపేట మున్సిపల్ అభివృద్ధికి రూ.25 కోట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో 130 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.18 కోట్లు ప్రకటించారు. అభివృద్ధి పనులను మేము వ్యతిరేకించడం లేదు. కానీ విద్యారంగంలో నెలకొన్న అసలు సమస్యలకు పరిష్కారం చూపకుండా కేవలం భవనాల నిర్మాణాలతోనే విద్యాభివృద్ధి సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు, ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మరోవైపు తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాల వంటి కనీస సదుపాయాల కొరత విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. 130 అదనపు తరగతి గదులు నిర్మిస్తామని ప్రకటించిన ప్రభుత్వం వాటిలో బోధించడానికి అవసరమైన ఉపాధ్యాయులను ఎప్పుడు నియమిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు, ముఖ్యమంత్రి 75 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 25 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించడం మంచిదే. కానీ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రకటనలకే పరిమితం చేయకుండా నియామకాలు పూర్తి చేయాలని అన్నారు, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల కోసం కళాశాలల చుట్టూ తిరిగే పరిస్థితిని ప్రభుత్వం వెంటనే మార్చాలని, విద్యార్థుల సర్టిఫికెట్లు



నిలిపివేసే సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ూ×ూఖీ తరఫున మా ప్రశ్నలు ఇవే:

1. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎప్పుడు విడుదల చేస్తారు?
2. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారు?
3. అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు ప్రత్యేక నిధులు ఎప్పుడు కేటాయిస్తారు?
4. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?
5. ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చర్యలు ఎప్పుడు తీసుకుంటారు?
6. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు ఎప్పుడు కేటాయిస్తారు?

గుడులు నిర్మించండి.. రోడ్లు వేయండి.. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి. కానీ అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించండి. విద్యార్థుల భవిష్యత్తును రాజకీయ ప్రకటనలకు పరిమితం చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు, ఒక రోడ్డు ఒక ప్రాంతాన్ని కలుపుతుంది.. ఒక పాఠశాల ఒక తరాన్ని తీర్చిదిద్దుతుంది. గుడులు ఆధ్యాత్మిక కేంద్రాలు కావచ్చు.. కానీ విద్యాసంస్థలు సమాజ భవిష్యత్తుకు పునాదులు, అచ్చంపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనుకుంటే ముందుగా విద్యారంగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ూ×ూఖీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని బలముల ప్రేమ్ కుమార్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ూ×ూఖీ అచ్చంపేట నియోజకవర్గ నాయకులు ఫన్నీ, చరణ్, సంతోష్, సంగీత్, చందు, లక్ష్మాపురం రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో సిసి రోడ్ల నిర్మాణం అండర్ డ్రైనేజ్ వ్యవస్థను ప్రతిష్ట చేయాలి

బి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

కొత్తకోట నవంబర్ 27 (విజన్ ఆంధ్ర) :

కొత్తకోట: మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి శుక్రవారం మున్సిపల్ కమిషనర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లలతో సమీక్ష సమావేశం నిర్వహించిన దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (+వీ=) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గతంలో రూపొందించిన కొత్తకోట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను మున్సిపల్



కమిషనర్ ఎమ్మెల్యే కు వివరించారు.అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ కొత్తకోట మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు.తొలివిడతలో 6, 11, 7, 8వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.పట్టణంలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన అంచనాలు వేసి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కమిషనర్ ని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి కృష్ణారెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, కౌన్సిలర్లు ఎన్ జే బోయెజ్, రవీందర్ రెడ్డి, నబి, మురళి, బీమా చంద్రకాంత్, సంజీవుడు, నాయకులు శేఖర్ రెడ్డి ,సలీం ఖాన్, సుభాష్, రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పల్లి కాలువలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

సర్పంచ్ రంజిత్ కుమార్ గౌడ్

విజన్ ఆంధ్ర నవాబ్ పేట్

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు వెళ్లే కాలువలో భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు 40 లక్షల నష్టపరిహారం ఇంటికి ఒక ఇందిరమ్మ ఇల్లు ఉద్యోగ భద్రత ఆర్థిక భద్రత ప్రభుత్వం ఇవ్వాలని యన్మంగండ్ల గ్రామ సర్పంచ్ రంజిత్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామంలో సభ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన చేసి నష్టపరిహారం ఇవ్వాలని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ యాదగిరి హాజరై కాలువలో కోల్పోతున్న రైతుల భూములను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని డిప్యూటీ కలెక్టర్ యాదగిరి తెలిపారు. గ్రామలలో 56 మంది రైతులను గుర్తించి 43 ఎకరాల భూమిని గుర్తించినట్లు ఆయన తెలిపారు. సంబంధించిన రైతులు తమ ఫిర్యాదులను తాసిల్దార్ కార్యాలయంలో వీరతులు తీసుకుంటారని సూచించారు. ఎలాంటి సందేహాలున్న తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.రైతులకు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేష్ డిజి ఆర్ఐ జిపిఓ సెక్రటరీ ఉపసర్పంచ్ గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

మానవత్వం చాటుకున్న మున్సిపల్ కార్యాలయం, చైర్మన్

జిన్నారం మున్సిపల్, నవంబర్ 27, (విజన్ ఆంధ్ర న్యూస్):



సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు రాళ్లకత్వ తండాలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆది దుర్గయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచిన మున్సిపల్ కార్యాలయం ద్వారా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందించింది. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్ వ్యక్తిగతంగా రూ.5,000 అందజేసి కుటుంబానికి చేయూతనిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తో పాటు కమిషనర్, నాయకులు పూజారు రాజు ఆది రామకృష్ణ స్థానిక గ్రామ నాయకులు పాల్గొని మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కష్టకాలంలో కార్మికుడి కుటుంబానికి అండగా నిలవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సిటిజన్ కాలనీలో శ్రీ అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్చెరు నవంబర్ 27 విజన్ ఆంధ్ర :



పటాన్‌చెరు నియోజకవర్గం, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సిటిజన్ కాలనీలో శ్రీ అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కాసాల నవాజ్ రెడ్డి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగస్వాములై స్వామివారి ఆశీస్సులు పొందారు.

మహాపడి పూజ సందర్భంగా కాలనీలో భక్తి వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆరాధన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, స్థానిక నాయకులు, వీణ= యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

పెబ్బేరు, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

పెబ్బేరు మండలం తిప్పాయిపల్లి గ్రామంలో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతు శ్రీ చిన్నబాబు బత్తాయి తోటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బత్తాయి రైతులకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పోషక యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు మరియు ఎల్‌నినో ప్రభావంపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్రీ విజయ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బత్తాయి తదితర ఉద్యాన పంటల అభివృద్ధికి అందిస్తున్న వివిధ పథకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.బత్తాయి పంటలో అధిక దిగుబడుల సాధనకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు మరియు ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి నుంచి తోటలను కాపాడుకోవడానికి డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ మరియు నీటి సంరక్షణ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ తోటల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

కేవీకే శాస్త్రవేత్త డా. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బత్తాయి తోటల్లో ఆశించే వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లను గుర్తించడం, వాటి నివారణకు చేపట్టాల్సిన సమగ్ర



సస్యరక్షణ చర్యలను వివరించారు. ముఖ్యంగా వేరు కుళ్లు మరియు గమ్మోసిస్ తెగులు నివారణకు తెగులు సోకిన మొక్కల మొదళ్ల వద్ద రిడోమిల్ గోల్డ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి డ్రెంచింగ్ చేయాలని, చెట్ల కాండంపై తెగులు సోకిన భాగాలను శుభ్రపరిచి బోర్డో పేస్ట్ పూయాలని సూచించారు. అలాగే తోటల్లో నీరు నిల్వ ఉండకుండా సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు.

సిట్రస్ క్యాంకర్ నివారణకు తెగులు సోకిన కొమ్మలను తొలగించడం, తోటలో పరిశుభ్రత పాటించడం మరియు సిఫారసు చేసిన రాగి ఆధారిత శిలీంధ్రనాశకాలను వినియోగించాలని వివరించారు. మైట్స్ (నల్లి) ఉధృతి వల్ల ఆకులు, లేత కొమ్మలు మరియు కాయలపై కలిగే నష్టాన్ని గుర్తించి, అవసరమైనప్పుడు సిఫారసు చేసిన మైటిసైడ్లను వినియోగించాలని సూచించారు. బత్తాయిలో పూత మరియు పిందెలు రాలడం తగ్గించేందుకు సరైన నీటి యాజమాన్యం, సమతుల్య పోషక యాజమాన్యం పాటించాలని వివరించారు.

ఉద్యాన కళాశాల, మోజెర్లకు చెందిన శాస్త్రవేత్త డా. ఖలధర్ బాబు మాట్లాడుతూ బత్తాయి తోటల్లో అధిక దిగుబడులు, నాణ్యమైన పండ్ల ఉత్పత్తి కోసం పాటించాల్సిన మంచి యాజమాన్య పద్ధతులను వివరించారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం వల్ల బత్తాయి తోటల్లో ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి మరియు వాతావరణ మార్పుల ప్రభావాలను వివరించారు.

ఈ పరిస్థితుల్లో పూత, పిందెలు రాలడం తగ్గించడంతో పాటు మొక్కలకు అవసరమైన పోషకాలను అందించేందుకు పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు మరియు మల్టీ మైక్రో న్యూట్రియెంట్స్‌ను 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అవసరమైన సమయంలో నీటిని అందించడం, నేలలో తేమ సంరక్షణకు మల్చింగ్ చేయడం, సేంద్రియ ఎరువుల వినియోగం మరియు సమతుల్య ఎరువుల యాజమాన్యం పాటించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాముడు గారు, ఉద్యాన అధికారి శ్రీ కృష్ణయ్య, ఉద్యాన విస్తరణ అధికారి బాల ప్రకాష్, క్లస్టర్ ఆఫీసర్స్ రవి, రాజు మరియు పెబ్బేరు మండలానికి చెందిన బత్తాయి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు రైతులు శాస్త్రీయ సాగుం పిలుపునిచ్చారు.

సారగట్ల మైసమ్మ దేవాలయ వివాదంపై సివిల్ కోర్టు కీలక ఆదేశాలు

దేవాలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దంటూ ఎనిమిది మంది ప్రతివాదులకు ఆదేశం.. కౌంటర్ దాఖలు చేసే వరకు మధ్యంతర ఉత్తర్వులు

చారకొండ,27 (విజన్ ఆంధ్ర)

నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గోకారం గ్రామ శివారులోని శ్రీ సారగట్ల మైసమ్మ దేవాలయ నిర్వహణకు సంబంధించి కల్వకుర్తి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. దేవాలయ వ్యవహారాల్లో ప్రతివాదులు జోక్యం చేసుకుంటున్నారంటూ దేవాలయ కమిటీ ఫౌండర్ చైర్మన్/ట్రస్టీ ముదిగొండ ఈదమయ్య కోర్టును ఆశ్రయించగా,విచారణ చేపట్టిన న్యాయస్థానం ప్రతివాదులు దేవాలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదని ఆదేశించింది.

ఈ కేసు ఐ.ఏ.నంబర్ 481/2026,ఓ.ఎస్.నంబర్ 36/2026గా కల్వకుర్తి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణకు వచ్చింది.శ్రీ సారగట్ల మైసమ్మ దేవస్థాన కమిటీ (రిజిస్ట్రేషన్ నంబర్ 646/2011) తరఫున ఫౌండర్ చైర్మన్/ట్రస్టీ ముదిగొండ ఈదమయ్య పిటిషనర్‌గా వ్యవహరిస్తున్నారు.ఎనిమిది మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు.2026 నవంబర్ 25న సీనియర్ సివిల్ జడ్జి ఎం.రాజు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతివాదుల తరఫు న్యాయవాది వకాలత్ దాఖలు చేసి కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కోరారు.పిటిషనర్ తరఫు న్యాయవాది దేవాలయ వ్యవహారాల్లో ప్రతివాదులు జోక్యం చేసుకుంటున్నారని మెమో దాఖలు చేశారు.

దేవాలయానికి సంబంధించి 2017లో తహసీల్దార్,దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జారీ చేసిన సమాచారాన్ని కూడా ప్రస్తావిస్తూ,రానున్న రోజుల్లో దేవాలయంలో ఉత్సవాలు,పూజా కార్యక్రమాలు సజావుగా నిర్వహించాల్సిన అవసరాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కీలక ఆదేశాలు ఇచ్చారు. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేసే వరకు దేవాలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదని స్పష్టం చేశారు. తదుపరి విచారణను 2026 డిసెంబర్



IN THE COURT OF SENIOR CIVIL JUDGE AT KALWAKURTHY

I.A.No.481 of 2026
in
OS.No. 36 of 2026

Between:-

Swaragatla Maisamma Devasthana Committee (Regd. No. 646 of 2011), H.No. 5-121, Charakonda Village, Vangoor Mandal (now Charakonda Mandal), Nagarkurnool District, Represented by its Founder Chairman/Trustee, Mudigonda Edamaiah S/o. M. Narasimha, Aged about 44 years, Occu: Agriculture & Social Service, R/o. Charakonda Village & Mandal, Nagarkurnool District.

...Petitioner/Plaintiff

AND

1. Boddu Ganesh S/o. Narahari, Aged about 33 years, Occu:Agril., R/o. Turkalapally Village, Charakonda Mandal, Nagarkurnool District.
2. Bodhagoni Venkataiah S/o.Laxmaiah Aged 48 years, Occu:Agril., R/o. Gokaram Village, Charakonda Mandal, Nagarkurnool District.
3. Jammula Nagesh S/o. Ramulu Aged 45 years, Occu:Agril., R/o. Gokaram Village, Charakonda Mandal, Nagarkurnool District.
4. Chilukeshwaram Naraiah S/o. Laxmaiah, Aged 45 years, Occu:Agril., R/o. Chandrayanpally Village, Madgul Mandal, Ranga Reddy District.
5. Kasaram Mahesh, S/o.Yadhaiah, Aged 35 years, Occu:Agriculture, R/o. Thimmapally Village, Charakonda Mandal, Nagarkurnool District.
6. Bheemdas S/o. Hanmanth, Aged about 34 years, Occu:Agriculture, R/o. Sarabanda Thanda, H/o. Thimmapally village, Charakonda Mandal, Nagarkurnool District.
7. Kandikanta Kiran S/o. Jangaiah, Aged about 45 years, Occu: Agriculture/Business R/o. Charakonda Village & Mandal, Nagarkurnool District.
8. Merugu Srinu, S/o.Kistaiah, Aged about 38 years, Occu:Agril., R/o. Turkalapally Village, Charakonda mandal, Nagarkurnool District

...Respondents/Defendants.

::DOCKET ORDER DT. 25.11.2026::

Vakalat for Respondent No.1 to 8 is filed, and he requests time to file counter. At this stage, the learned counsel for petitioner filed a memo stating that complaint [illegible] against the respondents for interfering into the affairs of the temple, but, [illegible] the learned counsel for respondent filed a memo enclosing the copies of

7వ తేదీకి వాయిదా వేశారు.ఈ సందర్భంగా గోకారం గ్రామ సర్పంచ్ పంజుగుల పరుశరాములు,దేవాలయ ఫౌండర్ ట్రస్టీ ముదిగొండ ఈదమయ్య మాట్లాడుతూ..శ్రీ సారగట్ల మైసమ్మ దేవాలయం గోకారం గ్రామ శివారులో ఉన్నందున దేవాలయ నిర్వహణకు సంబంధించిన అంశాలు గోకారం గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉండాలని పేర్కొన్నారు.దేవాలయ విషయంపై న్యాయపోరాటం చేస్తున్నామని, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ దేవాలయంలో పూజా కార్యక్రమాలు,ఉత్సవాలు సజావుగా జరగాలని ఆకాంక్షించారు.

గారకుర్తి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు

భారత రాజ్యాంగబద్ధంగా ప్రతి పౌరుడికి న్యాయం పొందే హక్కు ఉంది -- సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య

సంగారెడ్డి జిల్లా, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర న్యూస్):



సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొండాపూర్ మండల పరిధిలోని గారకుర్తి గ్రామంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై గ్రామ ప్రజలకు వివిధ చట్టాలు, పౌరుల హక్కులు, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జడ్జి బి. సౌజన్య , జిల్లా కార్యదర్శి న్యాయ సేవ అధికార సంస్థ సంగారెడ్డి జిల్లా వీరు మాట్లాడుతూ.... ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగబద్ధంగా న్యాయం పొందే హక్కు ఉందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదని తెలిపారు. అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని వివరించారు.

మహిళలు, పిల్లలు, వృద్ధులు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాలను వివరించారు. మహిళల హక్కులు, గృహ హింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాలు, మోటారు వాహన ప్రమాద బాధితులకు పరిహారం, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. న్యాయ సేవలను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడం, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, మండల వ్యవసాయ అధికారి గణేష్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ధాన్యం డెలివరీ వేగవంతం చేయాలి

జిల్లా నాగర్ కర్నూల్
నవంబర్ 27విజన్ ఆంధ్ర న్యూస్ :



నాగర్‌కర్నూల్‌లో రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌కు సీఎంఆర్ ధాన్యం సరఫరాపై ఈ సమావేశంలో సమీక్షించారు.సీఎంఆర్ ధాన్యం డెలివరీని త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బ్యాంకు గ్యారంటీలు, ఒప్పంద పత్రాలను వెంటనే సమర్పించాలని సూచించారు.డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని, సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఝూ కళ్యాణ్, ఇవీ రాజేందర్,ఝాజూలు, జుణులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ఫొటో పట్ల బీఆర్ఎస్ నాయకుల చర్యను ఖండించిన కాంగ్రెస్

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కొల్కురి నరసింహ రెడ్డి

పటాన్‌చేరు, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):



గురునానక్ జయంతి సందర్భంగా పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఫొటో పట్ల బీఆర్ఎస్ నాయకులు మన్నె క్రిషాంక్ తదితరులు వ్యవహరించిన తీరును పటాన్‌చేరు పట్టణ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ఉందని పట్టణ కాంగ్రెస్ నాయకుడు కొల్కురి నరసింహ రెడ్డి పేర్కొన్నారు.నవంబర్ 26న హైదరాబాద్‌లోని బావర్చి హోటల్ వద్ద రాహుల్ గాంధీ గురునానక్ జయంతి సందర్భంగా ప్రార్థనలో ఉన్న ఫొటోకు మాంసాహారం తినిపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రవర్తించారని ఆరోపించారు. ఈ చర్య ఒక నాయకుడిని అవమానించడమే కాకుండా, పవిత్రమైన రోజున మతపరమైన మనోభావాలను కించపరిచే విధంగా ఉందని విమర్శించారు.ఈ ఘటనపై పటాన్‌చేరు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బీఎన్ఎస్ సెక్షన్లు 299, 196, 197, 351 కింద సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు వెల్లడించారు.రాహుల్ గాంధీ అన్ని మతాలను, ప్రజల మనోభావాలను గౌరవించే వ్యక్తి అని పేర్కొంటూ, ఆయన పట్ల ఈ విధంగా వ్యవహరించడం బీఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని నరసింహ రెడ్డి విమర్శించారు. పోలీసు శాఖ వెంటనే స్పందించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బ్యాంకులపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో ఆర్బీఐ కీలక పాత్ర

ఆతిథ్య ఉపన్యాసంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు

పటాన్చెరు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):



బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడుతూ, ఆవిష్కరణలు మరియు పోటీని ప్రోత్సహించడంలో భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) కీలక పాత్ర పోషిస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు. 'రిజర్వు బ్యాంకు -- దైనందిన జీవితంలో మార్పు' అనే అంశంపై బిజినెస్ ఎకనామిక్స్ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ద్రవ్య స్థిరత్వాన్ని కాపాడటం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, బ్యాంకుల నియంత్రణ, కరెన్సీ నిర్వహణ, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని నిర్ధారించడం వంటి అంశాల్లో ఆర్బీఐ కీలక బాధ్యతలను నిర్వహిస్తోందని సుబ్బారావు వివరించారు. ధరల స్థిరత్వంతో ఆర్థిక వృద్ధిని సమతుల్యం చేయడం, ద్రవ్య నిర్వహణ, మారకపు రేట్ల హెచ్చుతగ్గులు, నకిలీ కరెన్సీ, డిజిటల్ రూపాయి వంటి అభివృద్ధి చెందుతున్న డిజిటల్ కరెన్సీల సవాళ్లపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు.

2008 నుంచి 2013 వరకు భారతీయ రిజర్వు బ్యాంకు 22వ గవర్నర్‌గా పనిచేసిన తన అనుభవాలను ప్రస్తావిస్తూ, ద్రవ్య విధానం, స్థూల ఆర్థిక నిర్వహణకు సంబంధించిన సిద్ధాంతాలను ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, వాస్తవ ప్రపంచ సవాళ్లతో అనుసంధానించారు. విద్యార్థులకు కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరుపై ఆచరణాత్మక అవగాహన కల్పించేలా ఉపన్యాసం సాగింది.

ఈ కార్యక్రమంలో వంద మందికి పైగా ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు. బిజినెస్ ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ కుమార్‌తో పాటు డాక్టర్ సోఫియా, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సాయి ఆశిష్ తదితర అధ్యాపకులు హాజరయ్యారు.

కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థపై విలువైన ఆచరణాత్మక అంతర్దృష్టులను అందించిన ఈ ఉపన్యాసం, అనుభవపూర్వక అభ్యాసానికి, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన మేనేజ్‌మెంట్ విద్యకు గీతం బీ-స్కూల్ ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతిబింబించింది.

కావాలంటే దీనికి పత్రికలో ప్రచురించడానికి సరిపోయే మరింత ఆకర్షణీయమైన హెడ్‌లైన్, చిన్న వార్తా వెర్షన్ కూడా తయారు చేస్తాను.

అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

బీఆర్ఎస్ తోగర్‌పల్లి గ్రామ అధ్యక్షుడు ఎర్రోళ్ల రవి

కొండాపూర్ (విజన్ ఆంధ్ర): నవంబర్ 27



అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ తోగర్‌పల్లి గ్రామ అధ్యక్షుడు ఎర్రోళ్ల రవి డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యం వర్షాలకు తడిసి నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు అండగా నిలవాలని కోరారు.

ఈ సందర్భంగా ఎర్రోళ్ల రవి మాట్లాడుతూ.. అకాల వర్షాలతో వరి ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే పంట సాగు కోసం రైతులు పెట్టుబడులు పెట్టి కష్టపడి పంటను పండించారని, చివరి దశలో వర్షాల కారణంగా ధాన్యం తడవడంతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలనిధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని సూచించారు.

వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎర్రోళ్ల రవి డిమాండ్ చేశారు.

ఆకుల లింగాపూర్ లో శ్రీ భక్త మార్కండేయ స్వామి వార్షికోత్సవము

అఖండ హరినామ సప్తాహము మరియు శ్రీ శివ పార్వతుల కళ్యాణము

నారాయణఖేడ్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):

ఈ సంవత్సరం శ్రీ సద్గురు దోండోపంత్ దాదా మహారాజ్, శ్రీ రూసింగ్ మహారాజ్ గార్ల ఆశీస్సులతో... ఆకుల లింగాపూర్ గ్రామములో కార్తీక బ।। పంచమి తేది 29-11-2026 ఆదివారము నుండి కార్తీక బ।। త్రయోదశి తేది 06-12-2026 ఆదివారము వరకు సప్తాహ కార్యక్రమము జరుపబడును.

స్వస్తి శ్రీ పరాభవ నామ సం।।ర కార్తీక బ।। ద్వాదశి తేది 05-12-2026 శనివారము ఉ।। 11-11 ని।।కు చిత్త నక్షత్రయుక్త శుభ లగ్న సుముహూర్తమున శ్రీ శివ పార్వతుల కళ్యాణము జరుపబడును.

రోజువారి కార్యక్రమాలు :

ఉ।। 10-00 గం।।ల నుండి మ।। 12-00 గం।।ల వరకు గాథ భజన,

సా।। 06-00 గం।।ల నుండి రాత్రి 07-00 గం।।ల వరకు హరిపాఠ్,

రా।। 09-00 గం।।ల నుండి రా।। 11-00 గం।।ల వరకు కాకడ హారతి,

రా।। 12-00 గం।।ల నుండి హరి జాగరణ్,

ఉ।। 04-00 గం।।ల నుండి ఉ।। 06-00 గం।।ల వరకు కాకడ హారతి.

కీర్తన కారుల పేర్లు :

తేది	వారము	కీర్తన కారుల పేర్లు
29-11-2026	ఆదివారము	హ.భ.ప. శ్రీ రాములు మహారాజ్, కిష్టాపూర్
30-11-2026	సోమవారము	హ.భ.ప. శ్రీ యాదవరావు మహారాజ్, గరిదేగావ్
01-12-2026	మంగళవారము	హ.భ.ప. శ్రీ హన్మంతు మహారాజ్, బందరేంజల్
02-12-2026	బుధవారము	హ.భ.ప. శ్రీ రమేష్ రెడ్డి మహారాజ్, చిన్న మాసానూర్
03-12-2026	గురువారము	హ.భ.ప. శ్రీ నర్సింలు మహారాజ్, కేరాజ్ కల్లాలి (ముంబయి)
04-12-2026	శుక్రవారము	హ.భ.ప. శ్రీ జ్ఞానేశ్వర్ రెడ్డి మహారాజ్, హోత్కుర్ణ
05-12-2026	శనివారము	హ.భ.ప. శ్రీ చైతన్య మహారాజ్, వడ్గావ్
06-12-2026	ఆదివారము	హ.భ.ప. శ్రీ శివమూర్తి బాలు మహారాజ్ గారిచే కాలకీర్తన జరుగును.

ఇతర వివరాలు :

వీణేకరి : హ.భ.ప. శ్రీ కిరణ్ మహారాజ్, బస్వాపూర్

గాయకులు : శ్రీ శంకర్ మహారాజ్, మహ్మదాబాద్, శ్రీ గుండప్ప మహారాజ్, రాంపూర్

మృదంగ వాదకులు : శ్రీ జ్ఞానేశ్వర్, దోంగ్రి, విరల్ మహ్మదాబాద్, మనోజ్, దద్ది, భగవత్, పుల్లస్, సాయిరాం

కాకడ ప్రముఖులు : సాయిలు, మహ్మదాబాద్

సౌండ్ సిస్టమ్ : మావులి సౌండ్ సిస్టమ్, బోర్గ్యాగావ్.

శ్రీ విఠల్ దాస్ మహారాజ్, శ్రీ కృష్ణదాస్ మహారాజ్ ఆశ్రమము, లింగాపూర్

ప్రతిరోజు అన్నప్రసాదం కలదు.

ఆలయ ప్రధాన అర్చకులు : శ్రీ మడుపతి సంగయ్య స్వామి సెల్: 9573013487

కార్యస్థలం :

శ్రీ భక్త మార్కండేయ మందిరము

గ్రా।। ఆకుల లింగాపూర్, మం।। నారాయణఖేడ్, జి।। సంగారెడ్డి.

ఆహ్వానించువారు :

గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, భక్త మార్కండేయ భక్తులు

సమస్త గ్రామ ప్రజలు

గ్రా।। ఆకుల లింగాపూర్, మం।। నారాయణఖేడ్.

సెల్ : 8978682939, 8465820862, 7995910819, 9618636540, 9704642023.

వెన్నుపాము బాధితుల స్వావలంబనకు పీర్ ట్రైనింగ్ కీలకం

ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో స్వతంత్ర జీవనం సాగించేలా అవకాశాలు కల్పించాలి లలిత కుమారి

పటాన్చెరు, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):

వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులు ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో స్వతంత్రంగా జీవించేలా అవకాశాలు కల్పించాలని సంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి అన్నారు.

రుద్రారం డోయన్ కౌంటీ టౌన్‌షిప్‌లోని ట్రియో రిసార్ట్స్‌లో మోటివేషన్ ఇండియా, స్పైనల్ కార్డ్ ఇంజురీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (సాజ×ూూ) ఆధ్వర్యంలో స్టేట్ స్ట్రీట్, క్యాఫ్ అమెరికా సహకారంతో నిర్వహిస్తున్న మూడు రోజుల పీర్ ట్రైనింగ్ కార్యక్రమంలో శుక్రవారం రెండో రోజు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ, వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తుల పునరావాసం, స్వావలంబన, జీవన నైపుణ్యాల అభివృద్ధికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి అవకాశాలు అందించడంతో పాటు సమాజంలో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

స్వతంత్ర జీవనానికి పీర్ ట్రైనింగ్ కీలకం షఫీ

సాజ×ూూ రాష్ట్ర అధ్యక్షుడు షఫీ మాట్లాడుతూ, వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులకు వైద్య చికిత్సతో పాటు సామాజిక, ఆర్థిక పునరావాసం కూడా అవసరమన్నారు. ఇతరులపై ఆధారపడే స్థితి నుంచి స్వతంత్రంగా జీవించే స్థాయికి చేరుకోవడంలో పీర్ ట్రైనింగ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. దివ్యాంగులకు సానుభూతి చూపడం కంటే సమాన అవకాశాలు, అందుబాటులో ఉండే మౌలిక వసతులు, ఉపాధి కల్పించడం ద్వారానే నిజమైన సాధికారత సాధ్యమవుతుందన్నారు.



జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి దివ్యాంగుల సంక్షేమం కోసం చూపుతున్న చొరవను షఫీ అభినందించారు. రాష్ట్రంలో తొలిసారిగా హెచ్ఎస్ఎన్ క్యాంపు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ శాఖల రోస్టర్ రిజిస్టర్లను పరిశీలించి సంగారెడ్డి జిల్లాలో దివ్యాంగులకు సంబంధించిన సుమారు 48 ఉద్యోగ ఖాళీలను గుర్తించడంలో ఆమె చేసిన కృషిని కొనియాడారు.

మోటివేషన్ ఇండియా ప్రతినిధులు సుధాకర్, నందిని శ్రీనివాసన్, రాము మాట్లాడుతూ పీర్ ట్రైనింగ్ ప్రాధాన్యతను, వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తుల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అవసరమైన శిక్షణ, సహకారం గురించి వివరించారు.

వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులే తమ జీవన అనుభవాలను తోటి వారికి పంచుకుంటూ వీల్‌చైర్ వినియోగం, రోజువారీ జీవన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం వంటి అంశాల్లో శిక్షణ అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత.

ఈ కార్యక్రమంలో పీర్ ట్రైనర్లు, వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయాలి: జగ్గారెడ్డి

-కిషన్ రెడ్డి పాదయాత్ర ఎన్నికల స్టంట్ - - - డ్రగ్స్‌పై సీఎం రేవంత్ ఉక్కుపాదం

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):



కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. ఇన్‌చార్జి బీఎం సందీప్‌ను కలిసిన ఆయన, తెలంగాణలో పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. ప్రజలకు, కార్యకర్తలకు చేయాల్సిన పనుల్లో పెండింగ్ అంశాలను పరిశీలించి పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. ఇన్‌చార్జి సందీప్‌తో రాజకీయ చర్చలు జరపలేదని, తనకు వ్యక్తిగతంగా ఎలాంటి ఫిర్యాదులు లేవని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ నేత కిషన్ రెడ్డి పాదయాత్రపై విమర్శలు గుప్పిస్తూ, ఇది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న ప్రచార యాత్ర మాత్రమేనని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టారని, ఎంతటి వారైనా డ్రగ్స్ వ్యాపారంలో ఉంటే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారని అన్నారు. నార్కోటిక్స్, ఈగల్ టీమ్‌ల ద్వారా డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నారని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ ప్రధాని కాలేరంటూ బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమని జగ్గారెడ్డి అన్నారు. పదవులు బీజేపీ నేతలకు కొత్త కావచ్చని, రాహుల్ గాంధీ కుటుంబానికి కాదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సహా పార్టీ నాయకులంతా పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 14 లేదా 20 ఎంపీ స్థానాలు గెలవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేతగా ముందుగా గుర్తింపు తెచ్చుకున్న తర్వాత సీఎం రేవంత్ రెడ్డిపై మాట్లాడాలని మహేశ్వర్ రెడ్డికి హితవు పలికారు.

సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్గా చాట్ల సిద్ధన్న.. వైస్ చేర్మెన్ శరత్ చంద్ర .. ప్రభుత్వం ఉత్తర్వుల జారి

సదాశివపేట :విజన్ ఆంధ్ర :

సంగారెడ్డి జిల్లా సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని శుక్రవారం ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్మన్గా చాట్లా సిద్దన్న , వైస్ చైర్మన్ గా పుబ్బిశెట్టి శరత్ చంద్ర తో పాటు మరో 12 మంది డైరెక్టర్ లు పరునంది రాఘవేందర్ , ఆకుల శోభారాణి , మహమ్మద్ అబ్దుల్ రఫ్, నినావత్ శ్రీనివాస్, మొహమ్మద్ నౌషిద్, భూచనల్లో మల్ రెడ్డి , పెద్ద గొల్ల శ్రీనివాస్,



తొంట సురేష్, తలారి ప్రభుదాస్, పట్నం రత్నయ్య , తాటికొండ కాశీనాథం , కొత్త



లక్ష్మణ్ కుమార్ లను ప్రకటించింది.

డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యం.. హైదరాబాద్‌లో మహా ర్యాలీ

నషాముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న సినీ ప్రముఖులు.. డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర న్యూస్):

దేశాన్ని డ్రగ్స్ రహిత భారతదేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి నిర్వహిస్తున్న నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో మహా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు సాయి కుమార్, నాగార్జున పాల్గొని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు.

ఈ మహా ర్యాలీలో సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు డా.నల్లగండ్ల అశోక్ కుమార్ పాల్గొన్నారు. డ్రగ్స్



రహిత భారతదేశ నిర్మాణం కోసం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

కృష్ణా గర్భంలో 'వేలం' దందా..!

ప్రభుత్వ భూములకు అనధికారికంగా పాటలు

బెక్కెంలో రూ.48 లక్షలు.. గూడెంలో రూ.45.10 లక్షలు.. గడ్డబస్వపురంలో రూ.31.15 లక్షలు వసూలు

సరిహద్దు వివాదాలతో మళ్లీ ఘర్షణ వాతావరణం

మేత కరువై పశుపోషకుల అగచాట్లు.. జల కాలుష్యం, వన్యప్రాణులకు ముప్పు

చిన్నంబావి, నవంబర్ 27:(విజన్ ఆంధ్ర)

కృష్ణా నదిలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో బయటపడుతున్న సారవంతమైన మునక భూములు అక్రమార్కులకు కాసుల పంట పండిస్తున్నాయి. వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల సరిహద్దుల్లోని నదీ గర్భ భూముల్లో అనధికారిక వేలంపాటలు, కబ్జాల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ భూములపై కొందరు గ్రామ/రైతు కమిటీల పేరుతో పెత్తనం చెలాయిస్తూ బహిరంగ వేలం నిర్వహిస్తూ రూ.కోట్లలో దందా సాగిస్తున్నారు.

ఏరు తేలగానే.. లక్షల్లో పాటలు:

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సుమారు 67 గ్రామాల ప్రజలు భూములు కోల్పోగా, ప్రభుత్వం అప్పట్లోనే పరిహారం చెల్లించి వాటిని సేకరించింది. ఏటా అక్టోబరు-డిసెంబరు మధ్య నదిలో నీరు తగ్గగానే ఒండ్రు, నల్లరేగడి నేలలు బయటపడతాయి. ఎరువుల ఖర్చు తక్కువగా ఉండి, శనగ, మినుము, జొన్న, నువ్వుల దిగుబడి అధికంగా వస్తుండటంతో ఈ భూములకు భారీ డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని చిన్నంబావి మండలంలోని పలు గ్రామాల్లో కమిటీల పేరుతో వేలంపాటలు నిర్వహిస్తున్నారు.

బెక్కెం పరిధిలో 150 ఎకరాలకు ఏకంగా రూ.48 లక్షలు

గూడెంలో 280 ఎకరాలకు రూ.45.10 లక్షలు,

గడ్డబస్వపురంలో రూ.31.15 లక్షలు,

కాలూర్‌లో దాదాపు 50 ఎకరాలకు రూ.10 లక్షలు మేర వేలం పాటలు నిర్వహించి సొమ్ము వసూలు చేసినట్లు సమాచారం.

వీటితో పాటు పెద్దమారూర్, చిన్నమారూర్, వెల్టూరు వంటి పరిసర గ్రామాల్లోనూ ముంపు భూముల సాగు వ్యవహారం చర్చనీయాంశంగా ఉంది. ప్రభుత్వ భూములను కౌలుకు ఇస్తూ పోగేస్తున్న ఈ నిధులను గ్రామ అభివృద్ధి పనుల పేరుతో ఖర్చు చేస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

హద్దుల వివాదంతో మళ్లీ ఉద్రిక్తత:

బడా వ్యాపారులు, కొందరు రైతులు వేలంలో వందలాది ఎకరాలను దక్కించుకుని రబీలో వ్యాపార పంటలు సాగు చేస్తున్నారు. నదీ గర్భంలో స్పష్టమైన హద్దులు లేకపోవడంతో వనపర్తి, గద్వాల జిల్లాల సరిహద్దు గ్రామాల మధ్య గతంలోనూ ఘర్షణలు తలెత్తాయి. బెక్కెం పరిధిలోని భూములను గూడెం వాసులు ఆక్రమించారని, అలంపూర్



తాలూకా క్యాతూరు సరిహద్దు రైతులు కొంత భూమిని అక్రమంగా సాగు చేస్తున్నారని గతంలో పరస్పర ఆరోపణలు, ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత సీజన్‌లోనూ అవే పరిస్థితులు పునరావృతమై శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

మూగజీవాలకు మేత కరువు.. జల కాలుష్యం, వన్యప్రాణులకు ముప్పు:

నదీ గర్భమంతా పంటలు సాగు చేస్తుండటంతో గొర్రెలు, మేకల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు తగ్గినప్పుడు సహజసిద్ధంగా పెరిగే పచ్చికపై ఆధారపడి జీవాలను మేపుకునేవారమని, ఇప్పుడు ఎటుచూసినా పంటలు వేయడంతో మేత, తాగునీరు కరువైందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పంటలకు వాడే రసాయన ఎరువులు, విచ్చలవిడిగా చల్లుతున్న పురుగుమందుల అవశేషాలతో కృష్ణా జలాలు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉంది. అలాగే పంటల రక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న వలల్లో చిక్కుకుని జింకలు, నెమళ్లు వంటి వన్యప్రాణులకు ప్రాణహాని కలిగే ముప్పు ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఘర్షణలు తలెత్తకముందే రెవెన్యూ, నీటిపారుదల, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో స్పందించి అక్రమ సాగును అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం: శ్రీనివాసులు, తహసీల్దార్, చిన్నంబావి

"శ్రీశైలం ప్రాజెక్టు కోసం పరిహారం చెల్లించి సేకరించిన భూములు పూర్తిగా ప్రభుత్వానివి. కొందరు కమిటీల పేరుతో నదీ గర్భ భూములను వేలం వేసి కౌలుకు ఇస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. పశు పోషకులకు మేత, నీరు అందుబాటులో ఉండేలా నదీ గర్భ భూముల్లో ఎలాంటి సాగు చేయకూడదని ఇప్పటికే గ్రామాల్లో దప్పు చాటింపు వేయించాం. పురుగుమందుల వినియోగం, పంటల చుట్టూ వలల విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించి సాగుకు దిగితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం."

బిటి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన

రాష్ట్ర మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి

శాంతినగర్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

జోగులాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం పర్యటించిన మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఇతర ప్రజా ప్రతినిధులు ఓపెన్ టాప్ వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ అలంపూర్ నియోజకవర్గంలోని శాంతినగర్ పట్టణానికి చేరుకోగానే అభిమానులు ఘనంగా స్వాగతం పలుకుతూ గజమాలతో సన్మానించారు. రాజోలి మండలం పచ్చర్ల గ్రామం నుంచి పెద్ద తాండ్రపాడు గ్రామానికి రూ.5 కోట్ల సిఆర్ఆర్



(కన్స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్) నిధులతో నిర్మించనున్న బిటి రహదారికి ప్రజా ప్రతినిధులు శాంతినగర్ పట్టణంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలు సంఘాల ప్రతినిధులు వివిధ సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, సర్పంచులు కాశపోగు బేబీ, సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ పాండు

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అడిషనల్ కలెక్టర్

పాఠశాలలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచన

సదాశివపేట: విజన్ ఆంధ్ర:-



విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ, పాఠశాల పరిసరాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు.

శుక్రవారం సదాశివపేట మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.

అనంతరం పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించారు.పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌కు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, శుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన పరిసరాలు, అహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ పాఠశాల నిర్వహణను బాధ్యతాయుతంగా చేపట్టాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ అనిత, సదాశివపేట ఎంఈఓ, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కనీస వేతనం రూ.26,000 చెల్లించాలి -- ఎఐజజ డిమాండ్

మనూర్ ఎంపీడీవో కార్యాలయం ముందు



గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా

నారాయణఖేడ్ నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):

సంగారెడ్డి జిల్లా మనూర్ మండల ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐజజ (ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఐజజ జిల్లా నాయకులు చిరంజీవి మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కాస్మోటిక్ వస్తువులు అందించాలని, ప్రతి కార్మికుడికి గ్రామపంచాయతీ గుర్తింపు ఐడీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మనూర్ ఎంపీడీవో చంద్రశేఖర్ గారికి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో దయాకర్, సయ్యద్, మైపాల్, ప్రమోద్, బాలయ్య, నర్సింలు, మాణిక్య తదితరులు పాల్గొన్నారు.

ఇట్లు TUCC -- ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా నాయకులు చిరంజీవి.